ప్రజాశక్తి
శనివారం 18 ఫిబ్రవరి 2023
5
అల్లూరి సీతారామరాజు



నర్సింగరావు నియామకం శుభ పరిణామం

- ఎంపీ గొడ్డేటి మాధవి



సన్మానిస్తున్న మాధవి, సుభద్ర

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు జిల్లా ఆసుపత్రికి అసిస్టెంట్ సివిల్ సర్జన్‌గా ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ టి.నర్సింగరావును నియమించడం శుభపరిణామమని ఎంపి గొడ్డేటి మాధవి అన్నారు. ఇటీవల జిల్లా ఆసుపత్రికి సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులైన నర్సింగరావును తలారిసింగిలోని నివాసంలో శుక్రవారం జడ్‌పి చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, జిసిసి చైర్మన్ శోభ స్వాతిరాణి, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ, గిరిజన ప్రాంత ప్రజలకు వైద్యపరమైన సేవలు అందించేందుకు ఆయనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



భారీ ర్యాలీ చేపడుతున్న కాఫీ రైతులు, నాయకులు

కాఫీ బకాయిలు చెల్లించే వరకూ ..

పోరాటం ఆగదు

- ఐటిడిఎ ముట్టడిలో పలువురు నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: కాఫీ ప్రోత్సాహక బకాయిలు చెల్లించే వరకూ పోరాటం అగదని పలువురు నాయకులు వెల్లడించారు. కాఫీ బకాయిలు చెల్లించాలని కాఫీ రైతులు శుక్రవారం ఐటిడిఏను ముట్టడించారు. గిరిజన సంఘం కార్యాలయం నుంచి గిరిజన రైతులు ర్యాలీగా ఐటీడీఏకు తరలి వెళ్లి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ...గత ఐదేళ్లలో చేపట్టిన కాఫీ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు చెల్లింపులు చేయని ప్రోత్సాహక సొమ్ము బకాయిలను పోరాడి రాబడతామని వెల్లడించారు. బకాయిలు చెల్లించే వరకు ఈ పోరు ఆగదని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ కాఫీ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలికి లక్కు మాట్లాడుతూ రెండున్నర లక్షల ఎకరాల్లో లక్షన్నర మంది గిరిజనులు కాఫీ సాగు చేస్తున్నా నేటికీ ఆర్థిక స్థోమతను పెంచుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. రైతులకు రూ.60 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాఫీ బకాయిలు చెల్లించక పోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐటిడిఏ పిఒ ప్రకటించిన కొత్త కాఫీ ప్రాజెక్టు లో ఒక ఎకరా కాఫీ సాగుకి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం కేటాయించాలని డిమాండ్ చేశారు.

అనంతగిరి జడ్పిటిసి సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ, ఐటీడీఏ ద్వారా వచ్చే ఏడాది నుంచి కొత్తగా చేపట్టే కాఫీ ప్రాజెక్ట్ ప్రణాళికలో గిరిజన రైతులకు భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల అవసరాలను, ప్రయోజనాలను గుర్తించి వారి అభిప్రాయాలను తెలుసుకొని ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాఫీ రైతుల సంఘం జాతీయ నాయకులు గేమ్మెలి చినబాబు (సుంకరమెట్ట సర్పంచ్) వివిధ మండలాల ఏపీ గిరిజన సంఘం నాయకులు ఎంఎం శ్రీను, పృథ్విరాజ్ ,పాంగి ధనుంజయ్, బుజ్జి బాబు (ఎంపిటిసి), కొండలరావు, కృష్ణారావు, సూర్యనారాయణ, ధర్మన్నపడాల్, చిట్టిబాబు, భాస్కర్ రావు (త్రినాథ్), నరసయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.25 కోట్ల రుణాల మంజూరుకు చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ఈ ధర్నాలో రైతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ఏజెన్సీలో కాఫీ రైతులకు తోడ్పాటు అందించేందుకు బ్యాంకర్ల ద్వారా రూ.25 కోట్ల రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి కాఫీ రైతు ఏడాదికి 20 రూపాయలు చొప్పున చెల్లిస్తే ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కాఫీ ప్రోత్సాహకాల బకాయిలపై ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇది వరకే నిధుల మంజూరు కోసం ప్రతిపాదన చేశామని తెలిపారు. సాంకేతికపరంగా కొన్ని స్కీముల నుంచి నిధులు రానందున కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయిలు ఉండిపోయాయని చెప్పారు. దీనిపై ప్రభుత్వానికి వివరించామన్నారు. గిరిజన రైతు సంఘాల నాయకులు ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కషి చేయాలని సూచించారు. ప్రతి మండలానికి 15 మంది చొప్పున కాఫీ రైతులతో సమావేశం నిర్వహిస్తామని, రైతులకు డ్రైయింగ్ యార్డ్స్, నిచ్చెన్లు, రుణాలు మంజూరు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ,. సబ్ కలెక్టర్ వి.అభిషేక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ఆగని విద్యార్థినుల మరణాలు

- ★ ముసినిగుంట ఆశ్రమ పాఠశాలకు చెందిన మరో బాలిక మృతి
- ★ 9 మందికి రంపచోడవరం ఆసుపత్రిలో చికిత్స
- ★ ఆందోళనలో తల్లిదండ్రులు
- ★ అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు




యమునశ్రీ మృతదేహం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రంపచోడవరం ఏజెన్సీ దేవీపట్నం మండలం ముసినిగుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత ఆశ్రమ విద్యార్థినుల మరణాలు ఆగలేదు. ఈ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పెనికిలపాడు గ్రామానికి చెందిన పి.యమునశ్రీ (12) కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గురువారం రాత్రి మృతి చెందింది. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న యమునశ్రీని గురువారం ఉదయం కాకినాడ జనరల్ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించి రాత్రి మరణించింది. గత గురువారం (ఫిబ్రవరి 9న) రాత్రి ఇదే పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని కానెం ఈశ్వరి దేవి అనారోగ్యంతో కాకినాడ జనరల్ ఆసుపత్రిలోనే మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. ఇది జరిగి వారం రోజులకే మరో విద్యార్థిని మృత్యువాత పడడంతో పాటు, ఇదే పాఠశాలలో చదువుతున్న మరో 9మంది విద్యార్థినులు అనారోగ్యంతో బాధపడుతూ రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఈ పాఠశాల విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాకినాడ జనరల్ ఆసుపత్రిలో యమునశ్రీని చూడటానికి వచ్చిన హాస్టల్ వార్డెన్, పాఠశాల ఉపాధ్యాయులను తల్లిదండ్రులు, గ్రామస్తులు నిలదీశారు. ఈ పాఠశాలలో సుమారు 258 మంది విద్యనభ్యసిస్తుండగా వారిలో సగానికి పైగా విద్యార్థినులను వారి తల్లిదండ్రులు పాఠశాల నుండి ఇళ్ళకు తీసుకెళ్లిపోయారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మృతురాలి కుటుంబానికి గిరిజన సంఘం నాయకుల పరామర్శ

విద్యార్థిని మరణ విషయం తెలుసుకున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, జిల్లా నాయకులు ఈ.సిరిమల్లెరెడ్డి, సిఐటియు నాయకులు ఎం వాణిశ్రీ, కె శాంతి రాజు శుక్రవారం బాలిక కుటుంబ సభ్యుల ను పరామర్శించి, ఓదార్చారు. మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యార్థినుల మరణాలకు గల కారణాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యతలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ పాఠశాలలో ఇలాంటి సంఘటనలు పదే పదే జరుగుతున్నా ఉన్నతాధికారులు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు.



మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎమ్మెల్యే ధనలక్ష్మి పరామర్శ

మృతి చెందిన బాలిక కుటుంబ సభ్యులను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం మండల ప్రజా ప్రతినిధులతో కలసి పరామర్శించారు. బాలిక మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని మృతి విచారకరమని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని తెలిపారు.

ఐటిడిఎ వద్ద గిరిజన సంఘం నిరసన

- హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్

రంపచోడవరం : ముసినిగుంట ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన మరో గిరిజన విద్యార్థి చనిపోవడం, 9 మంది విద్యార్థులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. గిరిజన సంఘం ఆధ్వర్యాన శుక్రవారం రంపచోడవరం ఐటిడిఎ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది అధిక నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే ఇద్దరు చనిపోవడంతో పాటు 9 మంది రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలోనూ, మరో ఇద్దరు రాజమండ్రి ఆసుపత్రిలోనూ చికిత్స పొందుతున్నారని తెలిపారు. పిల్లలకు ఆరోగ్య భద్రత కల్పించకుండా పాఠశాలలో చదువుతున్న మిగిలిన వారిని హెచ్‌ఎం ఇళ్లకు పంపించడం జరుగుతుందని తెలిపారు. చనిపోయిన విద్యార్థినుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలని, తరచూ వైద్య పరీక్షలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.వాణిశ్రీ, కె.శాంతి రాజు, ఎం.రమేష్, ఎవిఎస్‌పి నాయకులు చవలం రాంబాబు, కురసం వరలక్ష్మి, బోరగ వీరాయ్యమ్మ, పూసం బాలుదొర తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం, సిఐటియు నాయకులు

ఐదేళ్లలోపు పిల్లలు మృతి చెందితే..

అంబులెన్స్ ఇవ్వలేమన్నారు..

- ▶▶ కెజిహెచ్ ఎస్‌సి సెల్ సిబ్బంది మాటలు ఆవేదన కలిగించాయి
- ▶▶ అందుకే 120 కిలోమీటర్లు మృతశిశువును తరలించాం
- ▶▶ బాధిత తల్లిదండ్రుల ఆవేదన
- ▶▶ కుటుంబానికి జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర పరామర్శ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మృతి చెందిన శిశువును స్వగ్రామానికి తరలించడానికి అంబులెన్స్ నిమిత్తం కేజీహెచ్ ఎస్టి సెల్‌లో సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని మృతి చెందిన శిశువు తల్లిదండ్రులు చెండ మత్స్య కొండబాబు, మహేశ్వరి దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముంచంగిపుట్టు మండలం కుమడ గ్రామానికి చెందిన వీరు తమ ఆవేదనను సుభద్ర, అధికారులకు వివవరించారు. విశాఖ కేజీహెచ్ కు శిశువును తరలించామని, అక్కడ సరైన వైద్యం అందించకపోవడంతో శిశివు మృతి చెందిందని తెలిపారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు మృతి చెందితే అంబులెన్స్ ఇవ్వడం కుదరదని, ప్రైవేట్ వాహనం లేదా, సంచిలో మూట కట్టి బస్సులో వెళ్ళి పొండని కెజిహెచ్ ఎస్టీ సెల్ సిబ్బంది సమాధానం చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ముంచంగిపుట్టు మండలం కుమడ గ్రామంలో విశాఖ ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ లీలా ప్రసాద్, డిస్టిక్ టీబి కంట్రోల్ అధికారి టి.విశ్వేశ్వరనాయుడు బాధిత కుటుంబాలను శుక్రవారం పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ వాహనంలో తీసుకువచ్చే స్థోమత లేక పోవడంతో స్కూటీ పై విశాఖ నుండి పాడేరు వరకు 120 కి.మీ తీసుకొచ్చామని బాధిత తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు పాడేరు నుండి కుమడ వరకు వాహనాన్ని ఏర్పాటు చేసి స్వగ్రామంలో చేరవేసారని తెలిపారు. గతంలో అనేకమంది గిరిజనులు ఇటువంటి సంఘటనలు ఎదురైనప్పుడు బస్సుల్లో, సొంత వాహనాల్లో శిశు మృతదేహాలు తరలించిన సంఘటనలు అనేకం అని గుర్తు చేశారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదని కోరారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ, ఇటువంటి సంఘటనలు గిరిజన ప్రాంతంలో జరగడం చాలా బాధాకరమని, బాధ్యులైన వారిపై చర్య తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్వీఎస్ రమేష్, పంచాయతీ కార్యదర్శి గోపి, వైద్య సిబ్బంది, వైసిపి సీనియర్ నాయకులు కూడా మత్స్య లింగం గ్రామస్తులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సుభద్ర

గిరిజనులపై కెజిహెచ్ సిబ్బంది నిర్లక్ష్యం

ఐద్వా రాష్ట్ర నాయకులు వివి.జయ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ముంచంగిపట్టు మండలం కుమడకు గ్రామానికి చెందిన చిన్నారి అనారోగ్యంతో కేజీహెచ్‌లో మృతి చెందడంతో స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్ళాడానికి అంబులెన్స్ ఏర్పాటు చేయకపోవడం చాలా దుర్మార్గమని ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి జయ తెలిపారు. శుక్రవారం అరకువేలి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బిడ్డ చనిపోయి పుట్టెడు ధ్ణుఖంలో ఉన్న తల్లిదండ్రులకు కేజీహెచ్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం సరికాదన్నారు.ఈ సంఘటన పూర్తిగా ప్రభుత్వ వైపల్యమని చెప్పారు. గిరిజనులు కోసం కేజీహెచ్‌లో ఎస్టీ సెల్ ఉన్నపటికీ అధికారుల నిర్లక్ష్యంతో సరిగా పని చేయలేదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి భాగ్యవతి, సన్యాసమ్మ, మెత్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వివి జయ

శిశు మరణాల నియంత్రణలో విఫలం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: గిరిజన ప్రాంతంలో శిశు మరణాల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని గిరిజన మహిళ సంఘం (ఐద్వా) అధ్యక్షురాలు సీసా విజయలక్ష్మి విమర్శించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, విశాఖ నుంచి మృత శిశువును స్వగ్రామానికి తరలించేందుకు కేజిహెచ్ వైద్య సిబ్బంది అంబులెన్స్ ఏర్పాటుకు నిరాకరించడంతో సుమారు 120 కిలోమీటర్ల మేర స్కూటీపైనే మృతదేహాన్ని తరలించాల్సి వచ్చిందన్నారు. అంబులెన్స్ కూడా మృతదేహాలను తరలించడానికి ఏర్పాటు చేయక పోవడం బాధాకరమన్నారు. గిరిజన ప్రాంతంలో మాతా శిశు మరణాలను అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక వైద్య బృందాలు నియమించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై పోరాటానికి సిద్ధం కావాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఎస్‌కె సాబ్జీ
- మిరప పంట ఎకరాకు రూ.లక్ష నష్ట పరిహారం : కృష్ణయ్య డిమాండ్

ప్రజాశక్తి - ఎటపాక

తామర పురుగుతో పంట నష్టపోయిన మిరప రైతులకు నష్ట పరిహారం చెల్లించకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని, పరిహారం దక్కాలంటే రైతులంతా పోరాటానికి సిద్ధం కావాలని గోదావరి జిల్లాల ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అన్నారు. మండలంలోని నెల్లిపాక, నందిగామ గ్రామాల్లో నల్లి, తామర పురుగు ఆశించి నష్టపోయిన మిరప పంటలను శుక్రవారం ఎమ్మెల్సీ సాబ్జి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రైతు నాయకులు పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు రూ.2 లక్షలు పెట్టుబడి అయిందని, తామర పురుగు ఆశించడంతో పంట పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకునే జగన్ సర్కారుకు మిరప రైతులకు తామర పురుగు వల్ల జరిగిన నష్టం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. పోలవరం ముంపు సాకుతో ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇవ్వకుండా తప్పించుకోవాలని చూస్తుందని విమర్శించారు. పార్టీలకతీతంగా యువ రైతులంతా ఆందోళనకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. శాసన మండలిలో రైతుల పక్షాన పోరాడతామని హామీ ఇచ్చారు.

ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య మాట్లాడుతూ ఏజెన్సీలో ఈ-క్రాప్ నమోదు సరిగా చేయక, రైతులకు అవగాహన కల్పించపోవడంతో నష్టపోతున్నారని తెలిపారు. తామర పురుగు వలన నష్టపోయిన రైతులకు ఎకరానికి లక్ష రూపాయలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, పులుసు సూర్యనారాయణ, తోటకూర రాంబాబు, సీపీఎం మండల కార్యదర్శి ఐవి, నాయకులు పులుసు బాలకృష్ణ, ఆకిశెట్టి రాము, ఇరపా అజయ్, సొందె రామారావు, జి హరనాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు పుట్టి రమేష్, జనసేన మండల అధ్యక్షుడు మారాసు గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

విఆర్.పురం : మండలంలోని పెద్దమట్టపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య శుక్రవారం సందర్శించారు. కొనుగోలు చేయకుండా ఉన్న ధాన్యాన్ని వారు సిపిఎం నాయకులతో కలిసి పరిశీలించారు. కొనుగోలు ఎందుకు అపారో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాబ్జి, కృష్ణయ్య మాట్లాడుతూ టార్గెట్ పూర్తయిందని చెప్పి ఇలా 10 లారీలు ధాన్యాన్ని వదిలి వేయడంపై మండిపడ్డారు. పూర్తిగా ధాన్యం కొనుగోలు చేసి చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చినబాబు, ఎంపిపి కారం లక్ష్మి, ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ వెట్టి లక్ష్మి, రైతు నాయకులు చిక్కాల రామారావు, కారం సత్తిబాబు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

మండలంలోని చిన్నమట్టపల్లి పాఠశాలను ఎమ్మెల్సీ సాబ్జి, రైతు నేత కృష్ణ సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న మెనూ, విద్యాబోధన తదితర అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో మెరుగైన విద్య, మౌలిక సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తెలిపారు.





ఎటపాక మండలంలో మిరప రైతుల సమస్యలను తెలుసుకుంటున్న షేక్ సాబ్జి, కృష్ణయ్య, విఆర్.పురం మండలం చిన్నమట్టపల్లి పాఠశాలను సందర్శించిన దృశ్యం

సీలేరులో ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి -సీలేరు

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సీలేరులోనే నిర్వహించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజ్ఞపి చేస్తున్నారు. జీకే వీధి మండలం సీలేరు ఏపీ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ ద్వారా 73 మంది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్ష కేంద్రాన్ని చింతపల్లిలో ఏర్పాటు చేయడం వల్ల తమకు చాలా సమస్యలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీలేరు నుంచి చింతపల్లి వెళ్లాలంటే 70 కిలోమీటర్ల ప్రయాణించవలసి ఉందని, ఈ మార్గంలో బస్సులు కూడా పూర్తిస్థాయిలో లేవని, మార్గమధ్యలో బస్సులు మరమ్మతులకు గురైతే తాము పరీక్ష తప్పినట్లేనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సీలేరు జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాలలో ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తే ఎంతో అనువుగా ఉంటుందని, దీనిపై అల్లూరి సీతారామరాజు జిల్లా డీఈవో స్పందించి సానుకూలంగా చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు జికె.వీధిలో ఉన్న పరీక్ష కేంద్రాన్ని ఆ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు సీలేరులో ఏర్పాటు చేశారని, తమకు అంతకంటే దూరంగా పరీక్ష కేంద్రం ఉందని, తమ సమస్యలను దృష్టిలో పెట్టుకొని పరీక్ష కేంద్రం సీలేరులో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి
రమాప్రభ విస్తృత ప్రచారం


ఉపాధ్యాయులను కలిసి ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి -సీతమ్మధార : విశాఖ నగరం, అక్కయ్యపాలెంలోని పలు ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ విస్తృత ప్రచారం నిర్వహించారు.పలు పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. చట్టసభల్లో ప్రజల తరఫున ప్రశ్నించే గొంతు అవసరం ఎంతైనా ఉందన్నారు. పెద్దఎత్తున డబ్బుతో ప్రలోభపెట్టి, గెలవాలని ప్రయత్నించే రాజకీయపార్టీలకు ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. విద్యావేత్తలు, మేధావులు, 250 ప్రజాసంఘాల మద్దతుతో పోటీలో ఉన్న తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, మహిళా సంఘం నేత మాధవి, పోర్టు నాయకులు స్వతంత్రకుమార్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు.

రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ
సిపిఎం, సిఐటియు నేతల ప్రచారం


పట్టభద్రుల ఓటర్లను కలిసి అభ్యర్థిస్తున్న సిపిఎం, సిఐటియు నేతలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలిపించాలని కోరుతూ సిపిఎం, సిఐటియు నేతలు శుక్రవారం పలు గ్రామాల్లో కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి, పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సిపిఎం భీమిలి మండల కార్యదర్శి రవ్వ నర్సింగరావు, సిఐటియు నేత వాళ్ల నాగరాజు, ఆ పార్టీ నాయకులు బృందంగా బీచ్ రోడ్‌లోని చేపలుప్పాడ, మంగమారిపేట, కాపులుప్పాడ, తిమ్మాపురం, కె నగరపాలెం, నేర్ల వలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు.

సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేయాలి
- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.మహేష్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం యు.బొడ్డపుట్టు ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ప్రమాద ఘటనలో బాధ్యులు గా చేస్తు ఉపాధ్యాయులు జె. ప్రసాద్, హుకుంపేట మండల విద్యాశాఖాధికారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేయడం అన్యాయమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. పాఠశాల ఆవరణకు 200 మీటర్ల దూరంలో చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడిందని, దాని ప్రభావానికి నాలుగు విద్యుత్ స్తంభాలు నేల కొరగడంతో పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పడటంతో విద్యార్థిని మృతి చెందిన ఘటనలో వీరిని బాధ్యులను చేయడం సరికాదన్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

స్పందన సమస్యల పరిష్కారానికి చర్యలు
జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్


స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో 65 ఫిర్యాదులు అందాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ, జెసి జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్‌తో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. భూ సమస్యలపై అత్యధికంగా 20 ఫిర్యాదులు అందాయి. రోడ్డు, తాగునీటి సదుపాయాలు, అంగన్వాడీ కేంద్రాల మంజూరు, విద్యుత్ సౌకర్యం, స్వయం ఉపాధి పథకాల మంజూరు చేయాలని పలువురు వినతిపత్రాలను సమర్పించారు. స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

స్పందన లో స్వీకరించిన ఫిర్యాదుల్లో కొన్ని..

జికె వీధి మండలం జికె వీధి పంచాయతీ వీధివరం గ్రామానికి విద్యుత్ సౌకర్యం, రోడ్డు సదుపాయం, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని మర్రి లక్ష్మయ్య, పొంగి రత్తు తదితరులు కోరారు. పెదబయలు మండలం పిట్టలబొర్ర గ్రామం నుండి గుంజివాడ గ్రామం వరకు ఎనిమిది కిలోమీటర్లు, చింతలవీధి నుండి జామిగుడ గ్రామం వరకు రెండు కిలోమీటర్లు రోడ్డు నిర్మించాలని వినతి పత్రం అందజేశారు. పెదబయలు మండలం గోమంగి పంచాయతీ వంతరాయి గ్రామస్తుల గడుతూరి కోటి బాబు, పి.బాలకృష్ణ తదితరులు వన్నాడ జంక్షన్ నుండి పంగలం, వంతరాయి, సంపంగి బంద గ్రామం వరకు మంజూరైన రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించాలని కోరారు. చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ గెంజిగూడ గ్రామంలో జల్ జీవన్ మిషన్‌లో నిర్మించిన తాగునీటి పథకం నీరు సరిపోలేదని అదనంగా బోరు బావిని మోటారు వేసి మంచి నీటి సరఫరా చేయాలని ఆ గ్రామస్తులు కోరారు. డుంబ్రిగుడ మండలం కండ్రుం పంచాయతీ సర్పంచ్ మఠ్యం కుమారి, ఉమ్మడి పంచాయతీ సర్పంచ్ ఎస్.చిన్నబాబు స్వయం ఉపాధి పథకం మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. చింతపల్లి మండలం పెదబరడ పంచాయతీ తెడపల్లి గ్రామస్తులు జి.రమణ, జి.రమేష్ తదితరులు పెదగొంది గ్రామం నుండి కృష్ణాపురం రెండు కిలో మీటర్ల రోడ్డు నిర్మించాలని, సర్వేపల్లి జంక్షన్ నుండి బొద్దు రోడ్డు నుండి మంజూరైన రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. పెదగొంది గ్రామంలో అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ అంబేద్కర్, ఎస్ డిసి.వివిఎస్ శర్మ, టిడబ్ల్యు ఇఇ డివిఆర్ఎం రాజు, డిపిఒ కొండలరావు, ఐసిడిఎస్ పిడి ఇఇ లీలాకృష్ణ, టిడబ్ల్యు డిడి ఎ.కొండలరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, డిఎల్ పిఒ పిఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రధానమంత్రి ఆది ఆదర్శ్ గ్రామ యోజన పథకం కింద గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పథకం అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను దీష్టిలో పెట్టుకుని ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన గ్రామాలలో ఒక్కొక్క గ్రామానికి రూ.20.38 లక్షల మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జనాభాలో 50 శాతం, కనీసం 500 మంది గిరిజనులు ఉన్న గ్రామాలలో ఈ పథకం అమలు చేయాల్సి ఉందన్నారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో ఈ పథకం కింద 46 గ్రామాలు ఎంపికయ్యాయని తెలిపారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, రహదారులు, తాగు నీరు, మొబైల్ కనెక్టివిటీ, వైద్య ఆరోగ్య సదుపాయాలూ గుర్తించి ప్రణాళిక తయారు చేయాలన్నారు. సంబంధిత అధికారులు ఆయా గ్రామాలలో పర్యటించి ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకొని పారదర్శకంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రతిపాదించిన పనులను జిల్లాస్థాయి కమిటీ ఆమోదంతో రాష్ట్ర కమిటీకి, తదుపరి కేంద్ర ప్రభుత్వానికి పంపి ఆమోదం పొంది పనులు ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలక్టర్ జే.శివ శ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ, సుబ్ కలక్టర్ వి.అభిషేక్, శిక్షణ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఓ పి.అంబేద్కర్, జిల్లా అధికారులు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి


వినతిపత్రాన్ని చూపుతున్న నేతలు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: మండలంలోని కండ్రుం పంచాయతీ శిరసగూడ నుంచి అరమ పంచాయతీ ముసిరి గొందిగుడ వరకు తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.సూర్యనారాయణ ఆధ్వర్యాన గ్రామస్తులు శుక్రవారం అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శిరసాగూడ నుంచి ముసిరిగొంది గూడ వరకు సుమారు రెండు కిలోమీటర్లు దూరం ఉందన్నారు. రోడ్డు నిర్మించక పోవడంతో కండ్రుము, అరమ పంచాయతీ గ్రామాల గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నారన్నారు .గిరిజనులకు ఎటువంటి అనారోగ్యాలు వచ్చినా అంబులెన్స్‌లో హాస్పిటల్ కు తరలించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కే.రాంబాబు, సింహాచలం, పి డుంబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి
రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి


మాట్లాడుతున్న సిపిఎం నేతలు

టప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తాడిపుట్టు పంచాయతీ బొడ్డపుట్టు గ్రామంలో విద్యుత్ స్తంభం పడి మృతి చెందిన తూభురు ధన్విత బాధిత కుటుంబానికి రూ.25లక్షల పరిహారం చెల్లించాలని అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు, అరుకు మాజీ జడ్పీటీసీ కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం వారు గ్రామంలో పర్యటించి పరామర్శించారు. అనంతరం జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఒకటవ తరగతి చదువుతున్న ధన్విత మృతి చెందిందని తెలిపారు. పాఠశాలల్లో పెచ్చులు ఊడిపడుతున్న భవనాల మరమ్మతు చేపట్టి, కొత్త భవనాలు పూర్తి చేయాలన్నారు. అసంపూర్తిగా విడిచి పెట్టి లక్షల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని ఆయన దుయ్యబట్టారు. ప్రభుత్వమే బాధ్యత వహించి ధన్విత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హుకుంపెట సిపిఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణ్ రావు, గిరిజన సంఘం కార్యదర్శి టి.కృష్ణారావు, తాడేపుట్టు మాజీ సర్పంచ్ దేవన్ రాజు, రాప్ప పంచాయతీ మాజీ సర్పంచ్ కొండపల్లి అప్పలనాయుడు గెమ్మేల దేవన్న, చిట్టం. బీమన్న, సోమేల సుబ్బారావు, బొడ్డపుట్టు గ్రామస్తులు సత్యనారాయణ, సింహాచలం, చిట్టిబాబు,గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు

జీడి, మామిడి తోటలు దగ్ధం


దగ్ధమైన తోటలు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ చోటముక్కి పుట్టు, రాల్లపుట్టు గ్రామస్తులకు చెందిన గిరిజన రైతుల జీడిమామిడి, కాఫీ, సిల్వర్, మిరియాల తోటలను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధం అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని టిడిపి నాయకుడు మజ్జి చిన్ని బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సుమారుగా 10 ఎకరాల కాఫీ, సిల్వర్, మిరియాల తోటలు పూర్తిగా ఖాళీ బూడిద అయ్యాయన్నారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ కిముడు బలరాం, మఠం సిద్దేశ్వరరావు పడాల్ పాల్గొన్నారు.

బోధనా పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి హుకుంపేట : బోధనా పద్ధతులను పాటించాలని రాష్ట్ర పరిశోధక బృందం సభ్యులు సిహెచ్ఎం దొర సూచించారు. మండలంలోని జిల్లా పరిషత్, మెరికచింత, బాకూరులోని పాఠశాలల్లో పర్యటించారు. లెర్నింగ్ ప్రోగ్రాం ద్వారా ఉపాధ్యాయులు పాటిస్తున్న కొత్త విధానాలు ఆయన పరిశీలించారు అనంతరం పిల్లల విద్యా స్థాయి సమర్ధ్యాల పై ఆరా తీశారు. ఉపాధ్యాయులకు లెసన్ ప్లానింగ్, టీచింగ్ నోట్స్, తరగతి బోధన తీరు, ఉపాధ్యాయ డైరీ పరిశీలించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ, బోధనలో మార్పులు తీసుకురావాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట క్లస్టర్ సిఆర్పిఎఫ్ సభ్యులు ఉన్నారు.


జమాల్‌ఖాన్‌ను సత్కరిస్తున్న పెద్దలు

ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్‌కు సన్మానం

ప్రజాశక్తి-చింతూరు : ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్‌ను తూర్పుగోదావరి జిల్లా, కోరుకొండ మండలం, గాడాల గ్రామంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. చింతూరు మండలం నిమ్మలగూడెం గ్రామానికి చెందిన డాక్టర్ జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రతినెల మూడవ వారంలో గాడాల గ్రామంలో మూడు రోజులపాటు ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఎంతో మంది దీర్ఘకాలిక రోగులు ఈ శిబిరానికి వచ్చి తమ రోగాలను నయం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం గాడాల గ్రామంలో వీరభద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన సంబరాలకు డాక్టర్ జమాల్ ఖాన్‌ను గ్రామ పెద్దలు, గ్రామస్తులు సాదరంగా ఆలయంలోని ఆహ్వానించారు. ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు మాట్లాడుతూ డాక్టర్ జమాల్ ఖాన్ తమ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు ఉచితంగా మందులతో పాటు భోజనాలు ఏర్పాటు ఎంతో గొప్ప కార్యక్రమాన్ని చేస్తున్నారని కొనియాడారు. డాక్టర్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ రోగులకు సేవ చేసే మహాభాగ్యం కలిగించిన అల్లాకు తాను కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కుల, మత, లింగ భేదం లేకుండా అందరూ కలిసి మనుషులుగా జీవించాలని, కల్మషాలను వీడి కలిసి జీవించిన నాడే మనలో ఉండే అహం అనే పెద్ద వ్యాధి నుండి కాపాడబడతామని చెప్పారు. పేదల పట్ల కరుణ కలిగి ఉండాలని, సేవ గుణాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రసాదు, ముస్లిం సంఘ నాయకులు సుభానీ, గ్రామ పెద్దలు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణం వద్ద సర్పంచ్, తదితరులు

సచివాలయ నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని రేగులపాడు పంచాయితీ పరిధిలోని సచివాలయ భవన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని ఆ గ్రామ సర్పంచ్ బొగ్గా రామారావు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య డిమాండ్ చేశారు. పునాది స్థాయిలో అసంపూర్తిగా ఆపేసిన నిర్మాణాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ళు గడుస్తున్న సచివాలయ నిర్మాణం చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాయం సీతారామయ్య, మేకల నాగేశ్వరరావు, జి.బాబురావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మీడియాపై దాడిని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి -రాజవొమ్మంగి

ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియాపై కేంద్ర ప్రభుత్వ దాడిని ఖండిస్తూ రాజవొమ్మంగి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు శుక్రవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు పి రామరాజు, రాజవొమ్మంగి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జి.బాలరాజు, నాయకులు పి.వెంకటేశ్వరరావు, కె.శివప్రసాద్ మాట్లాడుతూ 2002లో గుజరాత్‌లో జరిగిన మత మారణహోమంలో నాటి గుజరాత్ ముఖ్యమంత్రి, నేటి ప్రధాని నరేంద్రమోడీ పాత్రను బయటపెట్టిన బిబిసి వార్తా చానల్‌పై కేంద్ర ప్రభుత్వం వేధింపులకు దిగడం దారుణమన్నారు. గుజరాత్ నరమేధంపై బిబిసి ఒక డాక్యుమెంటరీని ప్రచారం చేసిన నేపథ్యంలో ఆ సంస్థ కార్యాలయంపై ఆదాయపన్ను అధికారులు దాడులు చేయడం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వాల చర్యలపై విమర్శలు చేసే మీడియాని అణగదొక్కాలని చూడడం సరికాదని హితవుపలికారు. కేంద్ర ప్రభుత్వ చర్యను ప్రజాతంత్ర వాదులు, మేధావులు, ప్రజాసంఘాలు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌తో పని లేకుండా ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం, గౌరవ వేతనం వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహాశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు టి వీర్రాజు, బి శ్రీను, ఎన్ సతీష్, పి.సత్యనారాయణ, ఆలీ, ఎస్.రాజు, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


తహాశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జెన్‌కో కళాకారులకు బహుమతులు

ప్రజాశక్తి -సీలేరు

తిరుపతిలో 14 నుంచి 17 వరకు జరిగిన రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ కళాకారులు ఉత్తమ ప్రదర్శనలో ఐదు బహుమతులు గెలుచుకున్నారు. ఈ పోటీల్లో ఏడు నాటికలు ప్రదర్శించగా, ఇందులో ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ విద్యుత్ ఉద్యోగుల ప్రదర్శించిన 'అదోగతి' ఉత్తమ నాటికగా ఎంపిక కావడంతో పాటు తనకు ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా ఎంపికైనట్లు సీలేరు ఇఇ ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు. ఉత్తమ నటిగా జ్యోతి (విజయనగరం), ఉత్తమ రచయితగా వైఎస్.భాస్కరరావు, ఉత్తమ రంగాలంకరణ, ఉత్తమ స్టేజ్ అలంకరణగా శ్రీను బహుమతులు సాధించినట్లు వెల్లడించారు. సీలేరు కాంప్లెక్స్‌కు మంచి గుర్తింపు తేవడంపై చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్, ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఓ అండ్ డ్యాం ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈలు బాలకృష్ణ, బాబురావు, ప్రభాకర్, ఇంజనీర్లు, కార్మికులు కళాకారులకు ప్రశంసలతో ముంచెత్తారు.



బహుమతులతో జెన్‌కో కళాకారులు

మృత శిశువుకు అంబులెన్స్ కరువు ఘటనపై..

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండలానికి చెందిన మత్స్యరాజు దంపతుల బిడ్డ కెజిహెచ్‌లో మృతిచెందగా, ఆ చిన్నారిని స్వస్థలానికి తరలించేందుకు అంబులెన్స్‌ను సమకూర్చడంలో ఆసుపత్రి సిబ్బంది చూపిన నిర్లక్ష్యంపై ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్ అయింది. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై స్పందించింది. ఆసుపత్రి సిబ్బంది, ఎస్టీ సెల్ నిర్లక్ష్యం వల్ల 120 కిలోమీటర్లు దూరం ద్విచక్ర వాహనంపై శిశువు మృతదేహాన్ని తీసుకువెళడాన్ని పరిశీలించి ఆ కేసును సుమోటోగా స్వీకరించి సంబంధిత అధికారులు, సిబ్బందికి నోటీసులు జారీ చేయనున్నామని కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం తెలిపారు. శుక్రవారం కెజిహెచ్ ఆసుపత్రికి చేరుకున్న ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆర్ఎంఒ, ఎఆర్ఎంఒలు, ఎస్టీ సెల్ సిబ్బందితో సమావేశమయ్యారు. శిశువు మరణానికి వైద్య విధాన కారణాలపై ఆరా తీశారు. గిరిజన ప్రాంతాల బాలలకు అనారోగ్య పరిస్థితులు ఎదురైతే వారు కెజిహెచ్‌కు చేరుకునేందుకు ప్రత్యేకంగా ఎన్ని అంబులెన్స్‌లు వినియోగిస్తున్నారు, చనిపోయిన పిల్లలను ఆసుపత్రి సిబ్బంది ఎలా వారి సొంత ప్రాంతాలకు చేరవేస్తారు, ఎన్ని ప్రత్యేక వాహనాలు వినియోగిస్తున్నారు, ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు ఏమైనా ఉన్నాయా ? తదితర అంశాలపై సమాచారం సేకరించారు.


నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు, గ్రామస్తులు

ధాన్యం కొనుగోలు చేయండి

ప్రజాశక్తి - చింతూరు : రైతుల నుంచి పూర్తిస్థాయిలో వరి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం కల్లేరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలిపారు. కల్లేరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న 600 బస్తాలు ధాన్యాన్ని రెండు వారాల నుండి కొనుగోలు చేయకుండా నిలిపివేయడంతో విషయం తెలుసుకునన సిపిఎం మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. అక్కడ రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధానం నష్టదాయకంగా ఉందన్నారు. ప్రారంభం నుండి కూడా అరా కోరగా కొనుగోలు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. రైతులు నష్టపోయిన తమకేం ఇబ్బంది లేనట్టు ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోదిరెడ్డి, కారం శ్రీరాములు, సోడే జయమ్మ, సాయం రాజులు, కారం దూలమ్మ, పండ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి - సీలేరు : అంగవైకల్యం కలిగిన వారికి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా విశాఖపట్నం ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు సీలేరు, డొంకరాయి, మోతుగూడెం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ మావూరి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆపరేషన్ అనంతరం మామూలు రూపానికి తేవడం జరుగుతుందన్నారు. ఈ అవకాశం మార్చి 15 వరకు మాత్రమే ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయితీ నక్కగూడ గ్రామానికి చెందిన 13 ఏళ్ల కిలో బైయిాది అనేక బాలికకు ఉచితంగా ఆపరేషన్ చేయించడానికి విశాఖపట్నం తీసుకెళ్లినట్లు వెల్లడించారు. అంగవైకల్యం కలిగిన వారు విశాఖపట్నం అపోలో ఆసుపత్రిలో సంప్రదించాలని, లేకుంటే 9492388348 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఘనంగా శివపార్వతుల ఊరేగింపు

ప్రజాశక్తి-పాడేరు: మహాశివరాత్రి మహొత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం నుంచి శివపార్వతుల పల్లకి సేవ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి 10 గంటల వరకు ఆలయంలో భక్తులు శివపార్వతుల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు ఈ మేరకు పురవీధుల్లో భక్తుల సందర్శనార్థం శివపార్వతులను పల్లకిలోంచి నేల వేషాలు మేళతాళాలతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ టి.నర్సింగరావు, ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కొట్టగుల్లి సుబ్బారావు, వైస్ ఎంపీపీ గంగ పూజారి శివ, సర్పంచ్ భూ రెడ్డి రాము పాల్గొన్నారు

రెండో రోజూ ఒక్కరే నామినేషన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపి శాసనమండలి విశాఖపట్నం - విజయనగరం - శ్రీకాకుళం పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి శుక్రవారం కూడా ఒక్క అభ్యర్థే జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆనందపురం మండలం, తర్లువాడ గ్రామానికి చెందిన ఇల్లిపల్లి అప్పలరాజు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం రెండు సెట్ల పత్రాలు నామినేషన్ దాఖలు చేసిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తిరిగి శుక్రవారం మరొక రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.